క్లుప్తంగా

నారాయణసేవలో సత్యసాయి భక్తులు


కేజీబీవీలో విద్యార్థినులకు అన్న ప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: పుట్టపర్తికి చెందిన సత్యసాయి భక్తులు ఆదివారం పుట్టపర్తి మండలం అమ్మగొండపాళ్యం, పుట్టపర్తి, బుక్కపట్నం కేజీబీవీ బాలికల పాఠశాలలో నారాయణసేవ చేపట్టారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు అన్న ప్రసాదాలను అందించారు. కేజీబీవీలో సత్యసాయి కీర్తనలను ఆలపించారు.

చికిత్స పొందుతూ వైఎస్సార్‌సీపీ నేత మృతి


కారెడ్డిపల్లి బాషా (ఫైల్)

కదిరి అర్బన్: సున్నపు గుట్టతండాలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కారెడ్డిపల్లి బాషా(50) శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 17న ఓడీచెరువు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారెడ్డిపల్లి బాషా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో శనివారం రాత్రి మృతి చెందాడు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బాషా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కంటి వైద్య శిబిరం


శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చెన్నంశెట్టి లక్ష్మీదేవి, నాగభూషణం జ్ఞాపకార్థం కుమారుడు చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్ కుటుంబ సభ్యులు సహకారంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు, కార్యదర్శి ఆకులేటి రమేష్‌బాబు, కోశాధికారి ఉలవల నాగేంద్ర తెలిపారు. శిబిరంలో 42 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 26 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారన్నారురు. పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి, సభ్యులు పల్లెం వేణుగోపాల్, రాజగోపాల్, గోసే రాధాకృష్ణ, చందా నాగరాజు, వెంకటేష్, ఉట్టి ప్రసాద్, రాజీవ్, గిరక ప్రియాంక, పుట్లూరు నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పంచాయతీల ద్వారానే జరగాలి


మాట్లాడుతున్న రేగాటిపల్లి సురేష్‌రెడ్డి

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పనులు పంచాయతీల ద్వారానే జరగాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయితీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి రేగాటిపల్లి సురేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. సర్పంచ్‌లకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.1150 కోట్లను స్థానిక సంస్థలకు తక్షణమే జమ చేయాలన్నారు. పై డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్‌కు ఇస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి రావాలని ఆయన కోరారు.

కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారు బాబూ?




పింఛన్ల పునఃపరిశీలన కోసం నోటీసులు వచ్చినట్లు చూపుతున్న పింఛన్‌దారులు

- సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూపులు
- ఏడాదైనా పట్టించుకోని కూటమి సర్కార్
- మరోవైపు విచారణ పేరిట లబ్ధిదారుల కోతకు కుట్ర
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు

బత్తలపల్లి: కొత్త పింఛన్లు మంజూరుకు కూటమి ప్రభుత్వం ముఖం చాటేస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కనీసం దరఖాస్తుల స్వీకరణ కూడా చేపట్టలేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టిన నెల రోజుల్లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి మొండి చేయి చూపారు. మరోవైపు విచారణ పేరుతో ప్రస్తుతం తీసుకుంటున్న లబ్ధిదారుల్లో కోతకు కుట్ర పన్నడంతో బడుగులు ఆందోళన చెందుతున్నారు. పట్టణ, మండలాల్లో కొత్త పింఛన్లు కోసం ఆయా సచివాలయాల చుట్టూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తిరుగుతున్నప్పటికి ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని ఉద్యోగులు చెప్పడంతో దరఖాస్తుదారులు తెల్లముఖం వేసుకుని వెనుదిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో పింఛన్లు, కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగేదని, కూటమి పాలనలో అటువంటి పరిస్థితి లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఆశ చూపిన చంద్రబాబు ఆ హామీ గురించి అసలు ఆలోచనే చేయడంలేదు.

మూడు వేల మందికి పైగా ఎదురుచూపులు...

ధర్మవరం నియోజకవర్గంలో ధర్మవరం పట్టణంతో పాటు నాలుగు మండలాల్లో దాదాపుగా మూడు వేలకుపైగా అర్హులైన వారు కొత్త పింఛన్లు కోసం ఎదురుచూస్తున్నారు. ఇక 50 ఏళ్లకే పింఛన్ ఇస్తే ఇక ఎంత మందో చెప్పలేం. పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడం కోసం వీరంతా సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొందరు టీడీపీ నాయకుల ఇంటి చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయితే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు సమాధానమిస్తున్నారు.


బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయం

వైఎస్సార్‌సీపీ పాలనలో సులభతరం

వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నింటికీ వలంటీర్ వ్యవస్థ అందుబాటులో ఉండేది. వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి అర్హులను గుర్తించి వారే దరఖాస్తు చేసి పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేసేవారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్...

గత ఏడాది ఏప్రిల్ 18 నుంచి ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఏడాది పూర్తయినప్పటికీ ఓపెన్ చేయలేదు. గత ఏడాది జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడింది. పింఛన్లు తీసుకునేందుకు 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్న వారు కొత్త రేషన్‌కార్డుల కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ప్రస్తుతం 46,516 మంది పింఛన్లు తీసుకుంటున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో పింఛన్‌దారుల వివరాలు

మండలం పేరు	పింఛన్లు తీసుకుంటున్న వారి సంఖ్య
ధర్మవరం పట్టణం	17,958
ధర్మవరం రూరల్	6,723
బత్తలపల్లి	6,183
తాడిమర్రి	5,954
ముదిగుబ్బ	9,698

నిరంతర ప్రక్రియ కావాలి..



పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం చేపట్టాలి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారుగా ఏడాది కాలం పూర్తయినప్పటికీ ఒక కొత్త పింఛన్ ఇవ్వలేదు. ఉన్న పింఛన్లు తీసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అన్యాయం. వృద్ధులను ప్రభుత్వమే ఆదుకోవాలి. కళాకారులకు పింఛన్ ఇవ్వాలి.

–యోగానంద ఆచారి, వైఎస్సార్‌సీపీ కల్చరల్ వింగ్ ధర్మవరం నియోజకవర్గ ప్రెసిడెంట్, బత్తలపల్లి

గత ఏడాది దరఖాస్తు చేశా..



గత ఏడాది వితంతు పింఛన్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాను. ఏప్రిల్ మాసంలో ఎన్నికల కోడ్ రావడంతో కొత్త వితంతు పింఛన్ ఇవ్వకుండా నిలుపుదల చేశారు. ప్రస్తుతం ఎప్పుడు కొత్త పింఛన్లు ఇస్తారో అర్థం కావడంలేదు. నా భర్తకు వచ్చే పింఛన్ ఇస్తామంటున్నారు. మాలాంటి వారిపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం అన్యాయం.

–బాలగొండ బయమ్మ, వితంతువు, పోట్లమర్రి, బత్తలపల్లి మండలం

ఆదేశాలు రావాలి



కొత్త పింఛన్‌ల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పాత పింఛన్‌ల పరిశీలన పూర్తయిన తరువాత కొత్త వాటికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందితే అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ అయితే తరువాత అందులో పొందుపరిచి కొత్తవి మంజూరు చేస్తాం.

–నరసింహనాయుడు, ఎంపీడీఓ, బత్తలపల్లి.

ప్రభుత్వ పాఠశాలల ఆయాల సమస్యలు తీర్చాలి


మాట్లాడుతున్న సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ

ధర్మవరం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాల సమస్యలను తీర్చాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు కేవలం రూ.4 వేలు వేతనం ఇస్తూ వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారన్నారు. ఆయాలకు కనీసం రూ.10వేలు వేతనం పెంచాలని, ప్రతినెలా 5లోపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆయాలు చౌడమ్మ, జయమ్మ, ముంతాజ్, భాగ్యమ్మ, గంగమ్మ, నాగలక్ష్మి, పర్వీనా, నంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి తల్లికి ఆపన్నహస్తం


మృతుడి తల్లికి నగదు అందిస్తున్న తోటి స్నేహితులు

గాండ్లపెంట: జీనులకుంట పంచాయతీ వలసవాండ్లపల్లికి చెందిన రమాదేవి కుమారుడు వి.నాగార్జున(32) 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు గాండ్లపెంట ఉన్నత పాఠశాలలో 2006–2007 పదో తరగతి చదివాడు. మృతుడికి తల్లి మాత్రమే ఉంది. ఆమె పరిస్థితిని తెలుసుకున్న అతడి తోటి మిత్రులు ఆదివారం గ్రామానికి చేరుకుని మృతుడి తల్లికి రూ.35 వేలు ఆర్థిక సాయం అందించారు.

తలుపుల : ఉబ్బరవాండ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 1985–86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ సహచరుడు వెంకటనారాయణ పక్షవాతంతో ఇబ్బంది పడుతుండటంతో ఆదివారం రూ.22 వేలు ఆర్థికసాయం అందించారు. పూర్వ విద్యార్థులు వై బ్రహ్మానందరెడ్డి, కృష్ణమోహన్ నాయుడు, సి.రెడ్డిశేఖర్ నాయుడు, కే.వి రమణ, ఎస్ భారతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


బెంగళూరు కళాకారుల నృత్యప్రదర్శన

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని శిల్పారామంలో చిన్నారులు తమ ఆటపాటలతో ఆహుతులను అలరించారు. ఆదివారం ఆహ్లాదం కార్యక్రమంలో భాగంగా ప్రియపెట్టేం అవిఘ్న అభ్యాస ఇనిస్టిట్యూట్ డ్యాన్స్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ బృందం జాతీయభావాన్ని పెంపొందించే గేయాలకు డ్యాన్స్‌లు, అన్నమయ్య కీర్తనలకు నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించింది. ఏఓ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి


మాట్లాడుతున్న వేమయ్య యాదవ్

తనకల్లు: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం సీపీఐ మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలకు మభ్య పెట్టే కార్యక్రమాలను మానుకోవాలని తెలిపారు. నిరుద్యోగం పెరిగిపోయిందని, స్థానికంగా ఉపాధి లేకపోవడంతో ఎంతోమంది వలసబాట పడుతున్నారన్నారు. ఇళ్లు లేని పేదలకు స్థలం మంజూరు చేసి ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొంతలపల్లి గ్రామంలో వంద ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అంతకుముందు బస్టాండ్ కూడలి వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు కదిరెప్ప, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పవన్, మండల కన్వీనర్ రెడ్డెప్ప, రైతు సంఘం నాయకులు చౌడప్పయాదవ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చేదాకా పోరాటం ఆగదు


దీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు

ధర్మవరం: తమ సమస్యలు తీర్చేదాకా పోరాటం ఆగదని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాయంలో ముందు ఆదివారం నాలుగోరోజూ వారు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈసందర్భంగా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు బొగ్గు నాగరాజు, కార్యదర్శి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ తమ సమస్యలు తీర్చాలని కూటమి ప్రభుత్వానికి అనేక పర్యాయాలు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యల పెంచాలన్నారు. జీఓ 36 అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, చనిపోయిన కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు. దీక్షల్లో నాయకులు కాటమయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, దస్తగిరి, రాంప్రసాద్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఊరేగింపు


జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యం చేస్తున్న భక్తులు


అలంకరణలో చౌడేశ్వరీ దేవి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని వెంకటంపల్లిలో చౌడేశ్వరీ దేవికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల విరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా చౌడేశ్వరీ దేవిని పల్లకీలో కొలువుదీర్చి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. వెలుగుతున్న జ్యోతులను తలపై ఉంచుకుని నాట్యం చేశారు. భక్తులు ఫల, పుష్పాలను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. ఈ జ్యోతుల ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి


ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి పెంచుకోవాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో ఆదివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం జరిగింది. డీఎస్పీ మాట్లాడుతూ ఆపద సమయంలో శక్తియాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: నాగలగుబ్బ గ్రామంలో ఆదివారం ముదిగుబ్బ అప్‌గ్రేడ్ సీఐ శివ రాముడు సిబ్బందితో కలిసి నాకాబందీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం అక్రమంగా విక్రయించే వారు, రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా సోదాలను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశాం నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

సంక్షిప్త సమాచారం

చలో విజయవాడకు తరలిన రైతులు

ముదిగుబ్బ: ముదిగుబ్బ– పుట్టపర్తి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులు ఆదివారం చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతు రోడ్డు విస్తరణ కోసం భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తక్కువ పరిహారం అందిస్తామని చెబుతోందన్నారు. ప్రస్తుతం వున్న మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 30 రోజులుగా పరిహారం కోసం నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. తమకు న్యాయమైన పరిహారం అందే వరకు రోడ్డు విస్తరణ పనులను అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు. రైతులు సోమల ప్రకాష్ నాయుడు, వేలూరి హనుమంతు, విశ్వనాథ్, సోమల సనత్, ప్రభాకర్‌నాయుడు, రఘురాంశాస్త్రి, సోమల మునికుమార్, దేసు నారాయణ పాల్గొన్నారు.

సమాధులు ధ్వంసం చేశారని ఫిర్యాదు

నల్లమాడ: వంకరకుంట గ్రామ సమీపాన ముస్లిం శ్మశాన వాటికలోని సమాధులను ధ్వంసం చేశారంటూ గ్రామానికి చెందిన ముస్లింలు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 149–1లోని ప్రభుత్వ స్థలంలో పూర్వం నుంచి సమాధులు నిర్మించుకుంటున్నామన్నారు. శ్మశానం పక్కనే భూమి ఉన్న పలువురు శనివారం రాత్రి జేసీబీతో 60 శాతం సమాధులను ధ్వంసం చేసినట్లు వారు ఆరోపించారు. విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కుళ్లాయప్ప, టీ. కుళ్లాయప్ప, బాబు, ఉసేనప్ప, బాబయ్య, అల్లాబకష్, దస్తగిరి తదితరులున్నారు.

ఘనంగా శత వార్షికోత్సవం

ముదిగుబ్బ: మర్తాడులోని నేలకోటమ్మ ఆలయ శత వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి అర్బన్ సీఐ సునీత సునీత జన్మదినం సందర్భంగా ఖిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు షామీర్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉన్న 120 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షాకీర్, శేషు, శ్రావణ్, ఇర్ఫాన్, హన్ను తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం


వాకిలి ముందు క్షుద్ర పూజలు చేసిన దృశ్యం

నల్లమాడ: మండల కేంద్రంలోని గంగా థియేటర్ సమీపాన ఉన్న ఓ ఇంటిముందు క్షుద్ర పూజలు కలకలం రేపాయి. షాకీర్ అనే వ్యక్తి శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి తాము మామిడి తోట వద్దకు వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా గేటు తాళం పగులకొట్టి వాకిలి ముందు ముగ్గులు వేసి నిమ్మలకాయలు కోసి రకరకాల వస్తువులు ఉంచి క్షుద్ర పూజలు చేసి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ధర్మవరంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు


పుట్టపర్తిలో గురువులతో పూర్వ విద్యార్థులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1997–2002 వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. దాదాపు వంద మంది వరకు పూర్వ విద్యార్థులు హాజరై ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. ప్రస్తుతం ఎవరు ఏం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం పద్మావతికి పూర్వ విద్యార్థులు కంప్యూటర్, బ్లూటూత్ స్పీకర్, మైక్‌ను విరాళంగా అందజేశారు. అనంతరం అలనాటి గురువులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పుట్టపర్తి టౌన్: స్థానిక ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక సాయి ఆరామంలో సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత వారంతా ఒక్కచోట కలవడంతో సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. తమకు చదువు నేర్పిన గురువులు మల్లికార్జున గుప్తా, సత్యనారాయణ, మరళీమోహన్, క్రిష్టప్ప, సులోచన, బస్సోబిలను పూలమాలలు శాలువాలతో సత్కరించారు.